క్లుప్తంగా

చెరువు ఆధునీకరణ పనుల పరిశీలన



సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో గల అంబేడ్కర్ చెరువు ఆధునీకరణ పనులను బుధవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరిశీలించారు. పట్టణంలోని చెరువులను ఆధునీకరించి ప్రజలకు ఆహ్లాదం పంచేలా ఏర్పాటు జరుగుతున్నాయన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ ఉన్నారు.

వేగం నియంత్రణకు హెచ్చరిక బోర్డులు



సైన్‌బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై శరణ్య

రామగుండం: ఇటీవల రాజీవ్ రహదారిపై జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలపై రామగుండం పోలీసులు స్పందించారు. ఈ నేపథ్యంలో బుధవారం మల్యాలపల్లి సబ్‌స్టేషన్ నుంచి గోదావరిఖని వైపు వెళ్లే రహదారిలోని ప్రమాద మూలమలుపులను గుర్తించి రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ ఆదేశాల మేరకు రామగుండం ఎస్సై బత్తుల శరణ్య వాహనాల వేగ నియంత్రణకు మూడు చోట్లా సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో బుధవారం ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనర్థాలు, ప్లాస్టిక్ నియంత్రణపై గ్రామస్తులకు కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు అవగాహన కలిపించారు. అనంతరం కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ నేతృత్వంలో గ్రామస్తులకు బట్ట సంచులు పంపిణీ చేశారు. కేసీఆర్ సేవాదళం జిల్లా ప్రధాన కార్యదర్శి చాతాళ్ల కాంతయ్య, జిల్లా నాయకులు బొద్దుల సాయినాథ్, శ్రీకాంత్, మహేశ్, నాగరాజు, కైలాసం గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్ ఆధ్వర్యంలో బుధవారం డీఈవో ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అడ్డగోలు ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ అమ్ముతున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈదునూరి ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కల్వల స్టాలిన్, టౌన్ సెక్రటరీ ఆజాద్, రాజు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన రేకుల షెడ్డు



జూలపల్లి: మండల కేంద్రంలో కురిసిన వర్షానికి నిరుపేద కుటుంబానికి చెందిన రామగిరి రాజేశ్వరి రేకుల షెడ్డు కూలిపోయింది. మంగళవారం రాత్రి గాలితో కూడిన వర్షం కురవడంతో రేకుల షెడ్డు కూలిపోగా రాజేశ్వరి నిరాశ్రయురాలు అయ్యింది. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్‌ఐ సంపత్, సిబ్బంది, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు డిప్యూటీ తహసీల్దారు అబూబకర్ చెప్పారు.

గొడుగుల పంపిణీ

కోల్‌సిటీ: గోదావరిఖనిలో సోడా బండ్ల చిరువ్యారులకు మంచికట్ల చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం 26వ డివిజన్ కార్పొరేటర్ మంచికట్ల దయాకర్ రోడ్ల పక్కన సోడా బండ్లు విక్రయించే వారికి గొడుగులు పంపిణీ చేశారు. దయాకర్‌ను సోడా బండ్ల సంఘం నాయకులు, వ్యాపారస్తులు అభినందించారు.

మూలమలుపులు.. మృత్యుకుహరాలు

- అతివేగంతో రాజీవ్ రహదారిపై ప్రమాదాలు
- గత నెలలో ముగ్గురు మృత్యువాత
- ఈనెల 3న కారు బోల్తా
- వాహనాల వేగం కట్టడికి చర్యలు తీసుకున్నా.. ఫలితం శూన్యం



రాజీవ్ రహదారిపై ప్రమాదకర మలుపు

రామగుండం: రామగుండం మీదుగా వెళ్లే రాజీవ్ రహదారిలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. అంతర్గాం మండల పరిధిలోకి వచ్చే బసంత్‌నగర్ రైల్వే వంతెన, రామగుండం మండల పరిధిలోకి వచ్చే మల్యాలపల్లి సబ్‌స్టేషన్ నుంచి క్రషర్‌నగర్ వరకు రాజీవ్ రహదారిపై ఉన్న నాలుగు మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ప్రతీరోజు ముఖ్యంగా రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎడమ వైపు రహదారి రామగుండం పోలీస్‌స్టేషన్, కుడి వైపు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడం గమనార్హం. ఈ విధానంతో క్షతగాత్రుల బంధువులు ఏ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలనే విషయమై తికమకపడుతున్నారు.

గత నెలలో ముగ్గురు మృత్యువాత..

రాజీవ్ రహదారిపై ప్రతీరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో మూలమలుపుల వద్ద వాహనాల వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత నెల ఐదో తేదీన గర్భిణి నిహారిక వెళ్తున్న వాహనాన్ని క్రషర్‌నగర్ వద్ద వెనుక నుంచి అతివేగంగా వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అదే నెల 20న రామగుండం రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన గుంజపడుగు శంకర్ బైక్ అదుపు తప్పి పక్కనున్న డివైడర్ పిల్లర్‌కు ఢీకొని మృతిచెందాడు. పాలకుర్తి గ్రామానికి వ్యాపారి మందల సంపత్‌రెడ్డి వాహనం అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈనెల 3న గోదావరిఖనికి చెందిన సామల అభినవ్‌తేజ కారు అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇక గతంలో ఇదే ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన నగల వ్యాపారి కారు బోల్తా పడడంతో ఇద్దరు మృతిచెందగా వారి కోట్ల రూపాయల నగలు గల్లంతయ్యాయి. నాలుగేళ్ల క్రితం ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సైతం బోల్తా పడడంతో చాలామందికి తీవ్ర గాయాలయ్యాయి.

వాహనాల వేగం కట్టడి చర్యలు.. ఫలితం శూన్యం

నాలుగేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు బోల్తాపడడం, రెండు రోజుల వ్యవధిలోనే నగల వ్యాపారులు మృతిచెందడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. వాహనాల వేగాన్ని కట్టడి చేసే చర్యలలో భాగంగా వైట్‌లైన్స్ వేసి చిన్నపాటి బ్రేకర్లను ఏర్పాటు చేసినప్పటికీ అంతగా ప్రయోజనం లేకుండా పోయింది. నాలుగు ప్రాంతాల్లోని మూలమలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పెద్ద సైజులో రాత్రివేళల్లో రెడ్‌లైట్ వెలుగుతూ ఆరిపోయే విధంగా ఏర్పాటు చేస్తే వాహనదారులు తమ వాహనాల వేగాన్ని అదుపు చేసే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. రాబోయే వర్షాకాలంలో మరిన్ని వాహనాలు అదుపు తప్పే అవకాశం ఎక్కువగా ఉంది. దీనిపై సంబంధిత రోడ్ సేఫ్టీ, పోలీసు యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేగం నియంత్రణపై దృష్టి



గోదావరిఖని వైపు వెళ్లే రాజీవ్ రహదారిపై వాహనాలు అతివేగంగా వెళ్లే క్రమంలో మల్యాలపల్లి సబ్‌స్టేషన్ దాటిన తర్వాత మూలమలుపు గుర్తించకపోవడంతో అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల వేగం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే రోడ్లపై ఇరువైపులా సైన్ బోర్డులు ఏర్పాటు చేశాం. ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయమై విచారణ చేస్తున్నాం.

– బత్తుల శరణ్య, ఎస్సై, రామగుండం

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం



మంత్రిని సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు

ధర్మారం: రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కుల సంఘాల భవన నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలకేంద్రంలో చేపడుతున్న గౌడ, పద్మశాలీ, మున్నూరుకాపు సంఘం భవనాల పనులను బుధవారం పరిశీలించారు. ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. ఎల్లమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.పది లక్షలు మంజూరు చేశారు. పద్మశాలీ భవనం బిల్లుల జాప్యంపై ఇంజినీర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు బాస తిరుపతిరావు, గౌడసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

జూలపల్లి: ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొని పోలీసుల కేసులు ఎదుర్కొంటున్న ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంకెన్ల లక్ష్మణ్(కరాటే), జూలపల్లి గ్రామ రైతు సమన్వయ సమితి కన్వీనర్, మండల ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నాడెం మల్లారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ సాధనలో పాల్గొన్న వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఉద్యమకారులను సన్మానించారు. అడప లక్ష్మణ్, రాజలింగం సేట్, పాటకుల అనిల్, అమరగాని శ్రీనివాస్, గుమ్మడి రాజిరెడ్డి, కొండపల్లి కృష్ణమూర్తి, బంటు ఎల్లయ్య, తొంటి బుచ్చయ్య, గ్యాజంగి శ్యామల, పుప్పాల సరోజన, ఠాకూర్ కమలాబాయి, అమరగాని సరోజన, కొక్కుల వినోద, శోభ, రాజు, నాగరాజు, తేజ పాల్గొన్నారు.

ఈటలను కలిసిన రావుల



పుష్పగుచ్ఛం అందిస్తున్న రావుల రాజేందర్

గోదావరిఖని: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈటల నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు వడ్డేపల్లి రాంచందర్, గుండబోయిన లక్ష్మణ్‌కుమార్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ రమణకు పరామర్శ



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

జూలపల్లి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి గంగారాం ఇటీవల మరణించగా బుధవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ పరామర్శించారు. ఈ సందర్భంగా గంగారాం చిత్రపటానికి వారు నివాళి అర్పించారు.

'ప్రజాసంక్షేమం పట్టని బీఆర్ఎస్ సర్కార్'



మాట్లాడుతున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సీఎం ఫాంహౌస్, ప్రగతిభవన్‌కే పరిమితమయ్యారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బహుజనులకే రాజ్యాధికారం కట్టబెట్టాలని, పెద్దపల్లి గడ్డపై బహుజన జెండా ఎగరేయడం ఖాయమని అన్నారు. నాయకులు దాసరి హనుమయ్య, రియాజ్, వెంకటేశ్, అరుణ, కొమురయ్య, రవికుమార్, లింగయ్యగౌడ్, చంద్రశేఖర్, మహేశ్, సాదిక్, శ్రీనివాస్, సిద్దిక్ పాల్గొన్నారు.

ఎంపీవోకు సమ్మె నోటీసు అందజేత

మంథని: న్యాయమైన సమస్యల సాధనకు పంచాయతీ సిబ్బంది గురువారం నుంచి విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం మంథనిలో ఎంపీవో హరికి సమ్మె నోటీసు అందించారు. సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ డిమాండ్ చేశారు. పంచాయతీ ఉద్యోగులు కాసిపేట అశోక్, సంతోష్, శ్రీధర్, నవీన్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦12న జాబ్‌మేళా

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నల్ల ఫౌండేషన్ సభ్యుడు నిజాముద్దీన్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంఎస్ఎన్ లాబోరేటరీస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి స్థాపించిన నల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు.

✦స్పోర్ట్స్ హాస్టల్ సెలక్షన్స్

సుల్తానాబాద్: మండల స్థాయి స్పోర్ట్స్ హాస్టల్ సెలక్షన్స్ బుధవారం నిర్వహించారు. నాలుగో తరగతి విభాగంలో కె.బద్రీనాథ్, పి.కౌశిక్ 5వ తరగతి విభాగంలో ఎస్.సిద్ధార్థ, ఎం.మహిత్ సాయి జిల్లా లెవెల్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో సురేందర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రవీందర్, పీఈటీలు అభినందించారు.

✦అభివృద్ధి పనులపై సమీక్ష

సుల్తానాబాద్: మండలంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్‌అలీ, కార్యదర్శులు ఉన్నారు.

✦మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికుల బిల్లులు రాష్ట్రవ్యాప్తంగా రూ.15.45కోట్లు విడుదల చేసినట్లు బీఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి నారాయణ, ఎండీ.సాలెహ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో రూ.28లక్షలు పెద్దపల్లి జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. పెంచిన రూ.3వేల వేతనాన్ని త్వరలోనే విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాల్లో వంట కార్మికులు ఎంఈవో కార్యాలయాలకు వెళ్లి బిల్లులు చేయించుకోవాలని సూచించారు.

✦దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ ప్రాంగణంలో బుధవారం 25 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులను బీఆర్ఎస్ నాయకుడు అర్శనపల్లి శ్రీనివాస్ పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులు అందజేస్తున్న శ్రీనివాస్‌కు దివ్యాంగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి మానస, కారోబార్ రాజమల్లు ఉన్నారు.

✦పాఠశాలలో అమ్ముతున్న బుక్స్ పట్టివేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రైవేట్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న పాఠ్యపుస్తకాలను బుధవారం ఏబీవీపీ నాయకులు పట్టుకున్నారు. మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా.. స్పందించలేదంటూ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించామని రాష్ట్ర కమిటీ సభ్యుడు అజయ్ తెలిపారు. ఎంఈవో, సీఆర్‌పీలు పాఠశాల యజమాన్యానికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపించి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని నాయకులు రాజశేఖర్, నాగచంద్ర, మనీషా, ప్రవీణ్, ఓమేశ్, రాకేశ్ కోరారు.

✦మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

సుల్తానాబాద్‌రూరల్: గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తానని సర్పంచ్ వీరగోని సుజాత అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద రూ.20లక్షల నిధులతో బుధవారం నూతనంగా పంచాయతీ భవన నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు.

రూ.లక్ష సాయం వెంటనే అందించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: చేతివృత్తి పని చేసుకునే వారికి ప్రభుత్వం రూ.లక్ష సాయం అందించేలా రూపొందించిన పథకం కింద విశ్వబ్రాహ్మణులకు సత్వరమే నిధులు అందించి ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ కోరారు. ఈ మేరకు బుధవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఎన్నికలకు గడువు సమీపిస్తున్నందున ఎలక్షన్ కోడ్ అమల్లోకి రాకముందే నిరుపేదలైన విశ్వకర్మలకు సాయం అందేలా చూడాలన్నారు. నాయకులు రాజమౌళి, రాజ్యలక్ష్మి, కావ్య, నర్సింహాచారి, శ్రీనివాస్, రాజేందర్, కోటయ్య, భీమయ్య, సరిత, రూప, సౌమ్య పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు



రోడ్డుపై నిలిచిన వరద నీరు

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్‌లోని 100 ఫీట్ల ప్రధాన రహదారిపై మంగళవారం కురిసిన వర్షానికి భారీగా వరద నీరు నిలిచింది. బుధవారం వరకు కూడా రహదారిపై నిలిచిన నీరు వరద కాలువలోకి వెళ్లలేదు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి స్థానిక ఫైవింక్లయిన్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న 100 ఫీట్ల రోడ్డు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రహదారి పక్కన నిర్మించిన వరద కాలువలోకి వరద నీరు సులువుగా వెళ్లేలా పైపులను అమర్చలేదు. కాంట్రాక్టర్లు నాసికరంతో కర్బు నిర్మించి బిల్లులు తీసుకున్నారని ఆరోపణలున్నాయి. వర్షం కురిసినప్పుడల్లా చెరువును తలపించేలా వరద నీరు రోడ్డుపై నిలుస్తోంది. ఫలితంగా రోడ్డు చెడిపోయే అవకాశం ఉందని, దీనికి తోడు రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రామగుండం: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బుధవారం అంతర్గాం మండలంలోని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎంపీడీవో యాదగిరికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి ప్రభుత్వ ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, పీఆర్సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ రూ.19వేలు, స్వీపర్లకు రూ.16,500, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500గా నిర్ణయించామన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. వారాంతపు సెలవు, అర్జిత సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలని, ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీ ద్వారానే లైసెన్స్ ఇప్పించాలని తదితర డిమాండ్లపై జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

'ఫిట్‌నెస్ లేని స్కూల్‌బస్సులను సీజ్ చేయాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన స్కూల్‌బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, ఆకస్మిక తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవీందర్ కోరారు. ఫిట్‌లేని బస్సులో పరిమితికి మంచి విద్యార్థులను తరలిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని స్కూల్‌బస్సులను సీజ్ చేయాలన్నారు. నాయకులు ప్రశాంత్, శివాజీ, నవీన్ ఉన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపిక పోటీలు



ఓదెల: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సుల్తానాబాద్: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి మండల స్థాయి పోటీలను మంగళవారం నిర్వహించారు. నాలుగో తరగతి విభాగంలో బద్రినాథ్, పి.కౌశిక్, ఐదో తరగతి విభాగంలో సిద్ధార్థ, మహిత్‌సాయి ప్రతిభ కనబరచడంతో జిల్లా పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో సురేందర్ బుధవారం తెలిపారు. విద్యార్థులను ఎంఈవో, స్పోర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యాల రవీందర్, వ్యాయామ టీచర్లు అభినందించారు.

మండలస్థాయి ఎంపిక పోటీలు

జ్యోతినగర్: రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాలకు చెందిన విద్యార్థుల మండల స్థాయి ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజులుగా ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో మండల స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థుల జాబితాను మండల విద్యాధికారి సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు శ్రీనివాస్ విడుదల చేశారు. హెచ్ఎం శ్రీధర్, పీఈటీలు లక్ష్మణ్, శోభారాణి, కవిత, రమ్య, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు. రామగుండం మండలం నుంచి నాలుగో తరగతి విభాగంలో హర్షిత్ రాజ్, అఖిల్ సాయి, ఐదో తరగతి విభాగంలో హృతిక్ వర్ధన్, షేక్ ఆర్యన్, మంజిత్, సామ్యూల్, అభిరాం, మణిదీప్, షేక్ తమీమ్, పాలకుర్తి మండలం నుంచి నాలుగో తరగతి విభాగంలో విశ్వదీక్షిత్, శ్రీసాయి, ఐదో తరగతి విభాగంలో శివసాయి, అంతర్గాం మండలం నుంచి ఐదో తరగతి విభాగంలో వశీకర్, కార్తికేయ, హనీష్ ఎంపికయ్యారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఓదెల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ కునారపు రేణుకదేవి అన్నారు. ఓదెల మోడల్ స్కూలులో బుధవారం 4, 5వ తరగతి విద్యార్థులకు వివిధ క్రీడల్లో ఎంపిక పోటీలు ఎంపీపీ ప్రారంభించారు. ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ఎంఈవో ఆరెపల్లి రాజన్న, మోడల్‌స్కూలు ప్రిన్సిపాల్ జావీద్, ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుశిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీవాణి

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో విశ్వహిత సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కుట్టుశిక్షణ నూతన బ్యాచ్‌ను ప్రముఖ వైద్యురాలు, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, మేడిగడ్డ ఇరిగేషన్‌శాఖ ఏఈ అంబటి అర్చన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో అన్నిరంగాల్లో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు తానాజీ జాదవ్, ప్రాంత గోరక్షక్ వెంకన్న, జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, నాయకులు నేరేడుగుండా వెంకటస్వామి, సత్యనారాయణ, కుట్టు శిక్షణ శిక్షకులు ఆరెల్లి మమత, పద్మ, జ్యోతి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులను బానిసలనడం సరికాదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: మంథని బొక్కలవాగు వంతెనపై ఏర్పాటు చేసిన మహనీయుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు కాంగ్రెస్ నాయకులను బానిసలనడం సరికాదని మంథని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మహనీయుల చరిత్ర ఈ ప్రాంత ప్రజలకు తెలుసని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విగ్రహాలతో కాదన్నారు. నాయకులు వొడ్నాల శ్రీనివాస్, ఎరుకల ప్రవీణ్, పోలు శివ, శేఖర్, సత్యం, అజీంఖాన్, కిషన్, మల్లేశ్ ఉన్నారు.

కందితో మంచి లాభాలు

కమాన్‌పూర్: రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం (కే.వీ.కే)ద్వారా ఉచితంగా కంది విత్తనాలను బుధవారం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ–పీవీరావు, రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కే.వీ.కే సైంటిస్టులు డాక్టర్.పిల్లి కిరణ్ (సాయిల్ టెస్ట్), సర్పంచ్ కంది పంట ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. జూలై 15–30వ తేదీలోగా కంది పంట వేయాలని సూచించారు. క్వింటాల్ కంది ధర రూ.8,200 వరకు ఉందని, ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు పంట వస్తుందని తెలిపారు. పత్తి పంటలో అంతర్గత పంటగా కంది పంట వేయొచ్చన్నారు. సమావేశంలో గ్రంథాలయ డైరెక్టర్ గుడిసె గట్టయ్య, రైతులు సందెవేన కుమార్, బర్ల శ్రీకాంత్, కొప్పుల రవీందర్‌రావు, పబ్బా మొగిలి, కొండు నగేష్, ముడుసు నర్సయ్య, కొండు అంజన్న, అబ్బా తిరుపతి, కండె.కిష్టయ్య, మారుకొండ వెంకన్న, కనవేన సది, కనవేన ముత్యాలు, ఒర్రె సురేశ్, బత్తిని ప్రశాంత్, పిట్ల రాజశేఖర్, పర్సవేన సమ్మయ్య, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.